
ప్రజాశక్తి
శనివారం 8 నవంబర్ 2025
5
విజయనగరం



12న అప్రెంటీస్ మేళా

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఈ నెల 12న ఐటిఐ అభ్యర్థులకు అప్రెంటీస్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఐటిఐ కళాశాలల కన్వీనర్ ప్రిన్సిపల్ టి.వి.గిరి ఒక ప్రకటనలో తెలిపారు. 12 ప్రముఖ కంపెనీలు 200 అప్రెంటీస్ ఖాళీలను భర్తీ చేసేందుకు రాజాంలోని ప్రభుత్వ ఐటిఐలో ఈ మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అర్హత కలిగిన అభ్యర్థులు అప్రెంటీస్ పోర్టల్ (apprenticeshipindia.gov.in) లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, లేకుంటే నేరుగా బుధవారం ఉదయం 9 గంటలకు మేళాకు హాజరై రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. వివరాలకు 9573574643, 8121450657, 9849944654, 9441518355 నంబర్లను సంప్రదించాలని కోరారు.

రోడ్లు కాదు.. మృత్యు ద్వారాలు

బొబ్బిలి నియోజకవర్గ పరిధిలోని రహదారులు మృత్యు ద్వారాలుగా మారాయి. ఎక్కడికక్కడ లోతైన భారీ గోతులు, పెచ్చులూడిపోయిన రోడ్లు ప్రయాణికుల పాలిట యమపాశాలుగా మారాయి. అధ్వాన రహదారులపై ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. తరచూ ట్రాఫిక్ స్తంభించడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా రోడ్లు అధ్వానంగా మారడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి రహదారులను బాగుచేయాలని ప్రజలు కోరుతున్నారు.

- అధ్వానంగా బొబ్బిలి రహదారులు
- గోతుల్లో కూరుకుపోతున్న వాహనాలు
- తరచూ ప్రమాదాలు, ట్రాఫిక్‌జామ్

ప్రజాశక్తి -బొబ్బిలి

బొబ్బిలి-రామభద్రపురం మార్గంలో పారాది వంతెన కుంగడంతో భారీ వాహనాలు రాకపోకలకు వంతెన పైనుంచి అనుమతి ఇవ్వలేదు. దీంతో వాహనాలను బాడంగి, తెర్లాం మండలాల మీదుగా దారి మళ్లించారు. ఇక్కడితో ఈ రహదారులకు ప్రాణసంకటం మొదలైంది. ఈ రోడ్లన్నీ ఘోరంగా దెబ్బతిన్నాయి. భారీ వాహనాలు బాడంగి మీదుగా ముగడ, భీమవరం రోడ్డు, ఆకులకట్ట, పినపెంకి రోడ్డు, తెర్లాం రోడ్డు మీదుగా రాకపోకలు చేయడంతో రహదారులపై పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయి. గోతులతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి.





బాడంగి మండల కేంద్రంలో గోతిలో కూరుకుపోయిన లారీ

లారీని బయటకు తీస్తున్న పొక్లెయినర్

బాడంగిలో దుర్భర స్థితిలో..

బాడంగి మండల కేంద్రంలో రోడ్డు దుర్భర స్థితికి చేరింది. బస్టాప్ సమీపంలో ప్రధానరహదారిపై భారీ గొయ్యి ఏర్పడింది. అందులో మట్టిపోసి, కప్పేశారు. దీంతో తరచూ వాహనాలు అందులో దిగి, కూరుకుపోతున్నాయి. దీనివల్ల తరచూ ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది.

అధ్వానంగా ఆకులకట్ట - పినపెంకి రోడ్డు

బాడంగి మండలం ఆకులకట్ట నుంచి పినపెంకి వరకు రోడ్డు అధ్వానంగా మారింది. రోడ్డుపై భారీ గోతులు ఉండడంతో వర్షం కురిస్తే గోతులన్నీ చెరువులను తలపిస్తున్నాయి. రోడ్డుపై గోతులు ఉండడంతో వాహనాల రాకపోకలకు అనుమతి ఇవ్వలేదు.

తరచూ ట్రాఫిక్ జామ్

నియోజకవర్గంలో రామభద్రపురం -బొబ్బిలి, రామభద్రపురం - తెర్లాం, బొబ్బిలి -తెర్లాం, ఆకులకట్ట-పినపెంకి ప్రధాన మార్గాలు. ఈ ప్రధాన రహదారులపై పెద్దపెద్ద గోతులు ఏర్పడటంతో తరచూ ట్రాఫిక్ స్తంభిస్తోంది. గొల్లపల్లి నుంచి తెర్లాం వరకు ఎక్కడికక్కడే వాహనాల టైర్లు రోడ్డుకు మధ్యలో కూరుకుపోవడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. పిరిడి జంక్షన్ నుంచి తెర్లాం వరకు రోడ్డు గోతులమయంగా ఉండడంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

బొబ్బిలి - పాత బొబ్బిలి రోడ్డులో గోతులు

బొబ్బిలి - పాతబొబ్బిలి రోడ్డులో గోతులు ఏర్పడటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శ్రీలక్ష్మి శ్రీనివాస జ్యూట్ మిల్లు నుంచి పాత బొబ్బిలి పైపుల ఫ్యాక్టరీ వరకు రోడ్డుపై గోతులు ఉండడం వల్ల వాహనదారులు, ప్రజలు అవస్థలు పడుతున్నారు.

నిధులు మంజూరైనా ముందుకు సాగని పనులు

బొబ్బిలి - తెర్లాం రోడ్డుకు, పినపెంకి - ఆకులకట్ట రోడ్డుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. రోడ్డు పనులకు ఎమ్మెల్యే బేబినాయన శంకుస్థాపన కూడా చేశారు. కానీ పనులు మాత్రం ముందుకు సాగడం లేదు. పారాది కాజ్‌వే పాడైపోవడంతో వాహనాల రద్దీ పెరగడం వల్ల రోడ్డు నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు. వెంటనే పనులు ప్రారంభించి, త్వరగా పూర్తయ్యేలా చూడాలని పలువురు కోరుతున్నారు.



పారాది వద్ద కొట్టుకుపోయిన కాజ్ వే

కొట్టుకు పోయిన కాజ్ వే

మొంథా తుపాను సమయంలో కురిసిన భారీవర్షాలకు వేగావతి నది ఉధృతంగా ప్రవహించింది. పారాది వద్ద కాజ్‌వే పైనుంచి వరదనీరు ప్రవహించడంతో నది ప్రవాహానికి 10 మీటర్ల వరకు కాజ్‌వే కొట్టుకుపోయింది. మిగిలిన భాగం చిందరవందరైంది. వరదనీరు తగ్గినప్పటికీ కాజ్‌వే కొట్టుకుపోవడంతో వాహనాలు వెళ్లే పరిస్థితి లేదు. కాజ్‌వే కొట్టుకుపోవడం వల్ల భారీ వాహనాలను దారి మళ్లించారు. దారిమళ్లించిన రోడ్లు గోతులమయంగా ఉండటంతో బాడంగి, తెర్లాం - బొబ్బిలి, ఆకులకట్ట - పినపెంకి రోడ్లపై లారీలు కూరుకుపోతున్నాయి. దీంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. కాజ్‌వేను త్వరితగతిన బాగుచేసి వాహనాలు రాకపోకలకు అనుమతులు ఇవ్వాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.



లెనిన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, పార్టీ నాయకులు, కార్యకర్తలు

సోషలిజంతోనే సమసమాజం

సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

అక్టోబర్ విప్లవం స్ఫూర్తితో సమ సమాజం కోసం, సోషలిస్ట్ వ్యవస్థ కోసం కృషి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ పిలుపునిచ్చారు. శుక్రవారం రష్యా సోషలిస్ట్ వ్యవస్థ విజయవంతమై 108 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఎల్‌బిజి భవనంలో సభను ఏర్పాటు చేశారు. ముందుగా రష్యా విప్లవ కెరటం లెనిన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దోపిడీకి, ఫాసిస్ట్ పాలనకు వ్యతిరేకంగా పోరాడి రష్యాలో సోషలిస్ట్ వ్యవస్థ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. దాని స్ఫూర్తితో చైనా, కొరియా, క్యూబా వంటి దేశాల్లో సోషలిస్టు ప్రభుత్వాలు ఏర్పడ్డాయన్నారు. నేడు అవి ప్రపంచంలోనే ఆదర్శంగా ఉన్నాయన్నారు. నేడు అమెరికా, పెట్టుబడిదారీ దేశాల్లో కార్పొరేట్ల కోసం పాలన సాగుతోంది తప్ప ప్రజల కోసం కాదన్నది రుజువైందని చెప్పారు. పెట్టుబడిదారీ దేశాల్లో ఆకలి కేకలు, నిరుద్యోగం వంటి సమస్యలు రోజురోజుకు పెరుగుతున్నాయని తెలిపారు. వాటి ఫలితమే అమెరికాలో న్యూయార్క్ మేయర్‌గా సోషలిస్టు భావజాలం కలిగిన వ్యక్తి గెలవడం అన్నారు. నేడు మన దేశంలోనూ సామ్రాజ్యవాద దోపిడీ పాలన సాగుతోందని చెప్పారు. కార్మిక చట్టాలు లేకుండా చేసి బానిసలుగా మార్చే ప్రక్రియ నేడు సాగుతుందన్నారు. ఇటువంటి తరుణంలో సోషలిస్ట్ వ్యవస్థ కోసం రష్యా అక్టోబర్ విప్లవం స్ఫూర్తితో కృషి చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రెడ్డి శంకరరావు, నాయకులు ఎం.శ్రీనివాస, బి.రమణ, వెంకటేష్ కార్యకర్తలు పాల్గొన్నారు.

సోషలిజమే ప్రత్యామ్నాయం

అక్టోబర్ విప్లవ దినోత్సవం సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పి.రమణమ్మ అధ్యక్షతన ఎల్‌బిజి నగర్‌లో సభ ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రెడ్డి శంకరరావు మాట్లాడుతూ కమ్యూనిస్ట్ పార్టీ నాయకత్వంలో ఏర్పడిన సోషలిజమే పెట్టుబడిదారీ విధానపు దోపిడీని అంతం చేయగలదని నిరూపించింద న్నారు. ఆ విప్లవ స్ఫూర్తితోనే ప్రపంచంలో స్వాతంత్ర్య పోరాటాలు జరిగాయన్నారు. కార్యక్రమంలో సిపిఎం నగర కమిటీ సభ్యులు బి.రమణ, రామలక్ష్మి, రంభ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

రుచిచూస్తా.. నాకూ అన్నం పెట్టండి

విద్యార్థులతో క్యూలో నిలబడిన కలెక్టర్

ప్రజాశక్తి-గంట్యాడ



ప్లేటు పట్టుకుని విద్యార్థులతో క్యూలో నిలబడిన కలెక్టర్ రామసుందర్‌రెడ్డి

ఆయన జిల్లా మెజిస్ట్రేట్. మొత్తం జిల్లా యంత్రాంగాన్ని శాసించే ఉన్నతాధికారి. అయినప్పటికీ ఒక సామాన్య వ్యక్తిలా విద్యార్థులతోపాటు క్యూలో నిల్చొని భోజనం పట్టుకున్నారు. వారితో కలిసి నేలపైనే కూర్చొని భోజనం చేశారు. ఆయనే జిల్లా కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి. ఈ అరుదైన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. కలెక్టర్ రామసుందర్ రెడ్డి శుక్రవారం గంట్యాడ మండలంలో ఆకస్మికంగా పర్యటించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ముందుగా తరగతి గదిలోకి వెళ్లి ఆంగ్ల ఉపాధ్యాయుడు డిజిటల్ స్క్రీన్ ద్వారా చెబుతున్న పాఠాన్ని విన్నారు. అదే పాఠాన్ని తాను కూడా కొంతసేపు విద్యార్థులకు బోధించారు. విద్యార్థులతో ముచ్చటించి వివిధ అంశాలపై ఆరా తీశారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. తాను కూడా విద్యార్థులతో కలిసి క్యులైన్లో నిల్చొని పల్లెంలో భోజనం పట్టుకున్నారు. వారితో కలిసి నేలపైనే కూర్చొని భోజనం చేశారు. ఆహారాన్ని రుచికరంగా తయారు చేయాలని, విద్యార్థులకు కడుపునిండా భోజనం పెట్టాలని ఆదేశించారు. పర్యటనలో డిఇఒ యు.మాణిక్యం నాయుడు, తహశీల్దార్ నీలంతేశ్వరరెడ్డి, ప్రధానోపాధ్యాయులు ఝాన్సీలక్ష్మి, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వక్తృత్వ పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

గురజాడ నివాసంలో శుక్రవారం గురజాడ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యాన విద్యార్థులకు జిల్లా స్థాయిలో వక్తృత్వ పోటీలు నిర్వహించారు. గురజాడ రచనలలో మహిళ అనే అంశంపై విద్యార్థులంతా మాట్లాడారు. ఎం.లాస్య (జరజాపుపేట హైస్కూల్), ఎస్.ఆశాభవాని (గురజాడ పబ్లిక్ స్కూల్) ప్రథమ, ద్వితీయ స్థానాల్లో, ఎస్. జ్యోతి (ఆదిత్య స్కూల్), సిహెచ్. జ్యోషిక(సన్ స్కూల్), ఎస్.రమ్య (తోంద్రంగి హైస్కూల్) తృతీయ స్థానంలో నిలిచారు. విజేతలకు గురజాడ వర్ధంతి సందర్భంగా ఈ నెల 30న బహుమతులు అందజేయనున్నట్లు సమాఖ్య కార్యదర్శి కాపుగంటి ప్రకాశ్ తెలిపారు.

ప్రభుత్వ సేవలు సులభతరం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రభుత్వ సేవలను మరింత సులభతరంగా పొందేందుకు ప్రజలు మనమిత్ర వాట్సప్ గవర్నెన్స్ సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ పల్లి నల్లనయ్య సూచించారు. శుక్రవారం అన్ని సచివాలయాల పరిధిలో ఇంటింటి ప్రచారాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పౌర సేవలు మరింత సులభతరంగా పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం మనమిత్ర యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా 161 సేవలను కేవలం మొబైల్ ద్వారానే పొందవచ్చన్నారు.

మహిళల రక్షణకు శక్తి యాప్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

మహిళల రక్షణ, భద్రతకు శక్తి యాప్ ఉపయోగ పడుతుందని మహిళా పోలీసుస్టేషన్ సిఐ నరసింహమూర్తి, ఎస్ఐ శిరీషా తెలిపారు. శుక్రవారం నగరంలోని ఆదిత్య మహిళా కళాశాల విద్యార్థులకు శక్తి యాప్, ఈవ్ టీజింగ్, డిజిటల్ అరెస్టు, గంజాయి, సైబర్ నేరాలపై వారు అవగాహన కల్పించారు. విద్యార్థినులకు శక్తి మొబైల్ యాప్ ఏ విధంగా డౌన్‌లోడ్ చేయాలి, దాని పని తీరు గురించి క్షుణ్ణంగా వివరించారు. సైబరు నేరాలు, డిజిటల్ అరెస్టుల పట్ల అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. విద్యార్థులు గంజాయి, ఇతర మత్తు, మాదక ద్రవ్యాలకు బానిసలు కావద్దని కోరారు. గంజాయి గురించిన సమాచారం తెలిస్తే స్థానిక పోలీసు స్టేషనుకు లేదా డయల్ 100/112కు లేదా 1972కు వెంటనే తెలియజేయాలని సూచించారు.





కేంద్రీయ విద్యాలయంలో, విజయనగరం కోట జంక్షన్‌లో వందేమాతరం గీతాన్ని ఆలపిస్తున్న డిఆర్ఒ శ్రీనివాసమూర్తి, ఎస్‌పి దామోదర్, పోలీసులు, విద్యార్థులు, తదితరులు

వందేమాతరం స్ఫూర్తిని నిలబెట్టాలి

జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసమూర్తి • జిల్లా వ్యాప్తంగా గీతాలాపన

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

వందేమాతరం గీతం స్ఫూర్తిని నిలబెట్టేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని డిఆర్ఒ ఎస్.శ్రీనివాసమూర్తి పిలుపునిచ్చారు. వందేమాతర గీతం 150 వసంతాల వేడుకను శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వందేమాతర గీతాలాపనతో జిల్లా మార్మోగింది. స్థానిక బాబామెట్ట పిఎంశ్రీ కేంద్రీయ విద్యాలయంలో డిఆర్ఒ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ గీతం స్వాతంత్ర్య సంగ్రామంలో లక్షలాది మందికి ఉద్యమ గీతంగా, పోరాట నినాదంగా నిలిచి, దేశ ప్రజలను ఒకే తాటిపై నడిపిందని అన్నారు. ఇదే స్ఫూర్తితో పౌరులంతా ముందుకు నడిచి ఐకమత్యంగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డిఇఒ యు.మాణిక్యంనాయుడు, కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపల్ దిలీప్ మోడి, సెట్విజ్ సిఇఒ వి.విశ్వేశ్వరరావు, మేనేజర్ కెవి రమణ పాల్గొన్నారు.

కోటలోని విద్యాసంస్థల్లో వందే మాతరం 150వ వసంతాల వేడుక ఘనంగా జరిగింది. కార్యక్రమంలో మాన్సాస్ కరస్పాండెంట్ కెవిఎల్ఎన్ రాజు, ప్రిన్సిపల్ సాంబశివరావు, ఎంబిఎ కళాశాల ప్రిన్సిపల్ బిఎస్ఎన్‌రాజు, సెట్విజ్ సిఇఒ వి.విశ్వేశ్వరరావు, మేనేజర్ కెవి రమణ పాల్గొన్నారు.

పోలీసు శాఖ ఆధ్వర్యాన..

కంటోన్మెంట్ : జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో కోట జంక్షన్, పోలీసు సంక్షేమ పాఠశాల, పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో శుక్రవారం సామూహికంగా వందేమాతరం గీతాన్ని ఆలపించారు. ఎస్‌పి ఎఆర్ దామోదర్ మాట్లాడుతూ జాతీయోద్యమంలో వందేమాతరం గీతం భారతీయుల మధ్య ఐక్యత, స్ఫూర్తిని రగిలించిందన్నారు. కార్యక్రమంలో ఎఎస్‌పి పి.సౌమ్యలత, ఎఆర్ ఎఎస్‌పి జి.నాగేశ్వరరావు, డిపిఒ ఎఒ పి.శ్రీనివాసరావు, ఎస్‌బి సిఐ ఎ.వి.లీలారావు, సిఐలు ఆర్.వి.ఆర్.కే.చౌదరి, టి.శ్రీనివాసరావు, సిహెచ్.సూరినాయుడు, ఆర్ఐ ఎన్.గోపాలనాయుడు, టి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

- జిల్లా సర్వజన ఆసుపత్రిలో సూపరింటెండెంట్ అల్లు పద్మజ ఆధ్వర్యంలో వైద్యులు, సిబ్బంది వందేమాతర గీతాన్ని సామూహికంగా ఆలపించారు. అనంతరం జాతీయ కేన్సర్ అవగాహన దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించి, కేన్సర్‌పై అవగాహన కల్పించారు.
- డిసిసిబి కార్యాలయంలో చైర్మన్ కిమిడి నాగార్జున ఆధ్వర్యాన వందేమాతరం గీతాన్ని అధికారులు, సిబ్బంది సామూహికంగా ఆలపించారు. డిసిసిబి సిఇఒ సిహెచ్ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

విజయనగరంకోట : గాజులరేగలోని నారాయణ పబ్లిక్ స్కూల్లో కరస్పాండెంట్ మొయిద నారాయణరావు ఆధ్వర్యాన వందేమాతరం గేయం 150 ఏళ్ల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బంకించంద్ర చటర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఎన్నాళ్లకెన్నాళ్లకు..

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్న శిల్పారామం రహదారి శుభ్రత పనులు ఊపందుకున్నాయి. కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశాలతో సిబ్బంది శిల్పారామం రహదారిని బాగుచేశారు. కొంతకాలంగా ఆ రహదారిపై భవన వ్యర్థాలతో, చెత్తాచెదారాలతో అపరిశుభ్ర వాతావరణం దర్శనమిచ్చేది. ఈ విషయాన్ని గుర్తించిన కమిషనర్ రహదారి శుభ్రతకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో జెసిబి, ట్రాక్టర్ల సహాయంతో భవన వ్యర్థాలను, చెత్తా చెదారాలను తొలగించారు.

పోలీసు కుటుంబానికి చేయూత

ప్రజాశక్తి-కంటోన్మెంట్

పోలీసు కంట్రోల్ రూంలో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేసి, ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన ఎస్.సత్యనారాయణ కుటుంబానికి పోలీసు అధికారులు, సిబ్బంది చేయూతనిచ్చారు. పోలీసు అధికారులు, సిబ్బంది అందించిన రూ.1.48 లక్షల చెక్కును సత్యనారాయణ సతీమణి ఎస్.త్రివేణికి ఎస్‌పి ఎ.ఆర్.దామోదర్ శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో అందజేశారు. పోలీసు ఉద్యోగుల క్రెడిట్ సొసైటీ సభ్యత్వం ఉన్నందుకు ఫ్యూనరల్ ఖర్చుల నిమిత్తం రూ.30 వేలు, సొసైటీలో దాచుకున్న రూ.1,05,906 చెక్కులను వారి కుటుంబ సభ్యులకు అందజేశారు.

31 బియ్యం బస్తాలు వితరణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వాసవి చారిటీ మిత్రుల గ్రూప్ మాలధారుల అన్న ప్రసాదానికి 31 బస్తాలు బియ్యం వితరణ చేసింది. శుక్రవారం పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద బియ్యం అందజేశారు. కార్యక్రమంలో గ్రూప్ అధ్యక్షులు ఆలవెల్లి శేఖర్, కార్యదర్శి డిమ్స్ రాజు, కోశాధికారి సముద్రాల నాగరాజు, విజ్జపు విజయ్ కుమార్, కల్లూరి సతీష్, దేవాలయ కన్వీనర్ పెంటపాటి కామరాజు, దివ్వెల మణికిరీటి, మాటమ్రి శ్రీనివాసరావు, అడ్డా నరసింగరావు, ఎ.వి.కృష్ణారావు పాల్గొన్నారు.

కూరగాయల పెంపకంపై దృష్టి

ప్రతి నియోజకవర్గంలో నగరవనం • ఉద్యాన, పశు సంవర్ధక, అటవీ, ఎపిఎంఐపి శాఖలపై సమీక్షించిన కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరంకోట

స్థానిక మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా కూరగాయల పెంపకాన్ని పెంచాలని కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి తెలిపారు. జిల్లాలో సీజనల్‌గా డిమాండ్ ఉన్న పూలతోటల పెంపకం, అరటి తోటలు, బొప్పాయి, పుట్టగొడుగు, ఆకు కూరలు, తదితర పంటల విస్తీర్ణాన్ని పెంచడంపై ఉద్యాన అధికారులు దృష్టి సారించాలని తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ శుక్రవారం ఉద్యాన, పశుసంవర్ధక, అటవీ, ఎపిఎంఐపి శాఖలపై కలెక్టర్ సమీక్షించారు. ప్రతి మండలంలో కనీసం 500 ఎకరాల్లో ఉద్యాన పంటల అభివృద్ధి జరగాలని సూచించారు. విశాఖ, అనకాపల్లి వాణిజ్య పరంగా అభివృద్ధి చెందుతున్న దృష్ట్యా విజయనగరంపై కూరగాయల డిమాండ్ అధికంగా ఉంటుందన్నారు. దీనిని జిల్లా రైతులు సద్వినియోగం చేసుకునేలా అధికారులే చూడాలన్నారు. మైక్రో ఇరిగేషన్ ద్వారా జిల్లాలో 7500 ఎకరాలను లక్ష్యంగా చేసుకున్నామని, వచ్చే మార్చి నాటికి 2057 ఎకరాల్లో యూనిట్లను ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఎక్కడెక్కడ బిందు సేద్యానికి అవకాశం ఉందో గుర్తించి శత శాతం ఏర్పాటు చేయాలని పీడీ లక్ష్మీనారాయణకు సూచించారు. పశు సంవర్ధక శాఖ ద్వారా పశు గ్రాసాన్ని పెంచి పాడి అభివృద్ధికి చర్యలు చేపట్టాలని జెడి మురళీకృష్ణను ఆదేశించారు. జిల్లాలో ఉపాధి హామీ ద్వారా 1425 గోకులాలు మంజూరైతే, 521 మాత్రమే పూర్తయ్యాయని, మిగిలిన వాటికి ప్రతిపాదనలు పంపాలని సూచించారు. నగరవనాల అభివృద్ధి ప్రస్తుతం సారిపల్లి, బేతనాపల్లిలో పూర్తయ్యాయని, వెలగాడలో ప్రోగ్రెస్‌లో ఉందని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో ఒక నగర వనం అభివృద్ధి చేయడానికి ప్రతిపాదనలను తయారు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ముఖ్య ప్రణాళికాధికారి పి.బాలాజీ, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు వేగవంతం

అధికారులకు కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి-కంటోన్మెంట్

ఉపాధిహామీ పనుల వేగాన్ని పెంచాలని కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రతిరోజూ మండలంలో కనీసం వెయ్యిమందికి తక్కువ కాకుండా ఉపాధిపనులను కల్పించాలని సూచించారు. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధిహామీ చట్టం అమలుపై శుక్రవారం టెలీకాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులతో సమీక్షించారు. పనుల పురోగతిని తెలుసుకున్నారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ పనిలో పాల్గొనే వేతనదారుల సంఖ్యను గణనీయంగా పెంచాల్సి ఉందని చెప్పారు. ముఖ్యంగా తక్కువ ప్రగతి ఉన్న మండలాలపై ప్రత్యేక దృష్టి సారించి, పనుల వేగాన్ని పెంచాలని సూచించారు. వంద రోజుల పనికల్పనలో వెనుకబడిన మండలాలపై అసంతృప్తిని వ్యక్తం చేశారు. పనితీరు మెరుగుపడాలని ఆదేశించారు. అన్ని మండలాల్లో ఫారం పాండ్స్ పనులను వేగంగా పూర్తి చేయాలని చెప్పారు. వచ్చేవారం నాటికి కనీసం 20 శాతం పనులనైనా మొదలు పెట్టాలని ఆదేశించారు. హార్టీ కల్చర్, అవెన్యూ ప్లాంటేషన్, బ్లాక్ ప్లాంటేషన్ పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేసి, 12వ తేదీ తరువాత ఆమోదం తీసుకోవాలని సూచించారు. ఈ వారాంతానికి ఇ-కెవైసి పనులను 95 శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. సరాసరి వేతనం పెంచేందుకు అన్ని రకాల చర్యలూ తీసుకోవాలని, వారానికి కనీసం 10 రూపాయలైనా పెరిగేలా చూడాలని కలెక్టర్ సూచించారు. టెలీకాన్ఫరెన్స్‌లో డ్వామా పీడీ ఎస్.శారదాదేవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ లక్ష్యాలను చేరుకోవాలి

విజయనగరం కోట : ఉపాధి హామీ పనుల్లో లక్ష్యాలు చేరుకోవాలని ఎంపిడిఒ గంటా వెంకటరావు తెలిపారు. శుక్రవారం మండలంలోని కొండకరకాంలో ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. సాయంత్రం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి పంచాయతీకి వంద మందికి తక్కువ కాకుండా వేతనదారులకు పని కల్పించాలన్నారు. మినీగోకులాలు, ఇకెవైసి, తదితర అంశాలపై సమీక్షించి, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లకు లక్ష్యాలను నిర్దేశించారు. సమావేశంలో ఎపిఒ ఎ.రవిబాబు, ఇసి ఎం.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



కొండకరకాంలో కూలీలతో మాట్లాడుతున్న ఎంపిడిఒ వెంకటరావు

ఎమ్మెల్యే ప్రజాదర్బార్

ప్రజాశక్తి-విజయనగరంకోట



వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే అదితి

స్థానిక అశోక్ బంగ్లాలో ఎమ్మెల్యే అదితి గజపతిరాజు శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. సుమారు 40 వినతులు అందాయి. 2023-24లో ఇళ్ల స్థలాలు ఇచ్చినట్లు పట్టాలున్నా వారికి సైట్లు గాని, ఇల్లు గాని మంజూరు కాలేదని గుండాలపేట సర్పంచ్ కంది జగదీశ్వరి ఆధ్వర్యంలో వినతినిచ్చారు. గుండాలపేట వద్ద ఆర్‌టిసి బస్సులు నిలుపుదల చేయాలని కోరుతూ ఆ గ్రామస్తులు విన్నవించారు. బియ్యాలపేట పంచాయతీ పరిధిలో ఆర్ఎస్‌కె, వెల్‌నెస్ సెంటర్ భవనాలు పూర్తి చేయాలని సర్పంచ్ పడాల రామకృష్ణ అర్జీనిచ్చారు. గత ప్రభుత్వ హయాంలో ఇళ్లకు బిల్లులు మంజూరు చేయాలని సారిక సర్పంచ్ బొబ్బాది ఈశ్వరరావు వినతిపత్రం అందజేశారు. గుంకలాంలో లోఓల్టేజీ సమస్యను పరిష్కరించాలని టిడిపి నాయకులు, బలగం సత్తిబాబు, లంక నాగరాజు, తెల్ల రాజారావు బాబాజీ, బలగం పెంటయ్య వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో టిడిపి నగర అధ్యక్షులు గంటా రవి, కార్యదర్శి కోదండరాం, మండల కార్యదర్శి పాశి అప్పలనాయుడు, ఎంపిటిసి రాజేష్‌బాబు, నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

విజయనగరంటౌన్ : నగరంలో సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీల ఐక్య వేదిక నాయకులు ఎమ్మెల్యే అదితికి వినతి అందించారు. కార్యక్రమంలో నాయకులు చోడి ఆదినారాయణ, చెలికి లక్ష్మణరావు, కె.పార్వతి, కె.పైడిరాజు, కిశోర్ పాల్గొన్నారు.

రైళ్లలో గంజాయి రవాణాను నిరోధించాలి

ప్రజాశక్తి-కంటోన్మెంట్

రైళ్లలో గంజాయి అక్రమ రవాణాను నిరోధించాలని విశాఖ రైల్వే డిఎస్‌పి రామచంద్ర రావు సిబ్బందిని ఆదేశించారు. విజయనగరం రైల్వే పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీలలో భాగంగా శుక్రవారం సందర్శించారు. జిఆర్‌పి స్టేషను సిబ్బందితో సమావేశమై, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైళ్లలో, రైల్వేస్టేషన్ల వద్ద జరుగుతున్న దొంగతనాలను అరికట్టే విధంగా ట్రైన్ బీట్లు, ప్లాట్‌ఫాం బీట్లను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. రైళ్లలో ఏజెన్సీ ప్రాంతం నుంచి వేరే ప్రాంతాలకు, రాష్ట్రాలకు తీసుకు వెళ్తున్న గంజాయి ముఠాలపై ఈగల్ టీం, లోకల్ పోలీస్, ఆర్‌పిఎఫ్ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి గంజాయి రవాణాను నిరోధించాలన్నారు.

స్టేషనుకు వచ్చే బాధితుల పట్ల గౌరవంగా నడుచుకోవాలని సూచనలు చేశారు. స్టేషన్‌లో నమోదైన కేసు ఫైళ్లను పరిశీలించి పెండింగ్‌లో ఉన్న కేసుల్లో దర్యాప్తు త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. స్టేషన్ రికార్డులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తంచేశారు. రైల్వే ఎస్ఐ సిబ్బంది పనితీరును ప్రశంసించారు. కార్యక్రమంలో విశాఖపట్నం లైన్స్ సర్కిల్ ఇన్స్పెక్టర్ .రవికుమార్ విజయనగరం సబ్ ఇన్స్పెక్టర్ వి. బాలాజీ రావు , సిబ్బంది పాల్గొన్నారు.

క్యాంపు కార్యాలయంలో 'జనవాణి'

ప్రజాశక్తి - భోగాపురం

ఎమ్మెల్యే లోకం నాగమాధవి శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో జనవాణి కార్యక్రమం నిర్వహించారు. మత్స్యకార, నెయ్యిలు తదితర వర్గాలకు చెందిన వారు పాల్గొని వారి జీవనోపాధికి చెందిన మత్స్య సంపద అభివృద్ధి, చెరువుల సంరక్షణ, ఆర్థిక స్థితి మెరుగుదల వంటి అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ చెరువుల్లో చేపల పెంపకాన్ని ఆధునిక పద్ధతుల్లో అభివృద్ధి చేస్తే గ్రామీణ మత్స్యకారుల జీవన ప్రమాణాలు పెరుగుతాయన్నారు.

పోలిపల్లిలో ప్రజా దర్బార్


వినతులు స్వీకరిస్తున్న కర్రోతు

మండలంలోని పోలిపల్లి గ్రామంలో ఏపి మార్క్‌ఫెడ్ చైర్మన్, టిడిపి ఇంచార్జి కర్రోతు బంగార్రాజు తన నివాసంలో శుక్రవారం ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బంగార్రాజు కార్యకర్తలు, ప్రజల నుంచి భూ సమస్యలు, ఎయిర్‌పోర్ట్ నిర్వాసితుల ఫిర్యాదులు, సిసి రోడ్లు, కాలువలు, విద్యుత్ సంబంధిత ఇబ్బందులు వంటి వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

వరి దిగుబడి తనిఖీలు

ప్రజాశక్తి - గజపతినగరం

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద దిగుబడి తనిఖీలను గజపతినగరం రైతు సేవా కేంద్రం పరిధిలో కెల్లా పాపారావు, జి. హరికృష్ణ పొలాల్లో శుక్రవారం నిర్వహించారు. ఈ తనిఖీల్లో స్థానిక రైతులు సాగుచేసిన వరి పంట దిగుబడి ఆశాజనకంగా ఉందని గుర్తించారు. ఎఒ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో దిగుబడి తనిఖీలు చేయగా దిగుబడి సరాసరిని అంచనా వేయగా ఎకరాకు 29 నుండి 30 క్వింటాలు వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎవిఒ ధనలక్ష్మి, బీమా కంపెనీ ప్రతినిధి గోపి, వ్యవసాయ సహాయకులు అప్పలనాయుడు, పలువురు రైతులు పాల్గొన్నారు.

రైల్వే ట్రాక్ దాటి ప్రమాదాల బారిన పడకండి

ప్రజాశక్తి - బొబ్బిలి

రైల్వే ట్రాక్ దాటి ప్రమాదాలు బారిన పడవద్దని రైల్వే అదనపు జడ్జి జి.కార్తికేయ కోరారు. స్థానిక రైల్వే స్టేషన్‌లో శుక్రవారం ప్రత్యేక కోర్టు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా పట్టాలు దాటిన వారిపైన, నో పార్కింగ్ స్థలంలో వాహనాలు పార్కింగ్ చేసిన వారిపై, రైలు, రైల్వే స్టేషనలలో మద్యం తాగి అల్లర్లు చేసిన వారిపై ఆర్‌పిఎఫ్ పోలీసులు నమోదు చేసిన 256 కేసులను న్యాయమూర్తి విచారించి జరిమానా వేసి కేసులను కొట్టి వేశారు. రైలు పట్టాలు దాటవద్దని, మద్యం తాగి రైలు ప్రయాణం చేయవద్దని ప్రయాణికులను ఇన్‌స్పెక్టర్ పిసి పండా కోరారు.

ఇ-గవర్నెన్స్‌పై అవగాహన

ప్రజాశక్తి- డెంకాడ

లెండి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో భాగంగా శుక్రవారం గొలగాని పేటలో డిజిటల్ లిటరసీ, ఈ-గవర్నెన్స్ ప్రజలకు వాలంటీర్లు అవగాహన కల్పించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ఆన్‌లైన్ యాక్సెస్‌పైనా, పౌర సేవల కోసం అవసరమైన పద్ధతులను సులభంగా వివరించి, టెక్నాలజీ పారదర్శకత, సౌకర్యాన్ని ఎలా పెంచుతుందో చూపించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఒ డాక్టర్ రవితేజ, అధ్యాపకులు అజీజ్, వాలంటీర్లు యశ్వంత్, తనుశ్రీ, నవ్య, దినేష్, దీక్షిత, జనని, షాజిద్ తదితరులు పాల్గొన్నారు.

ఎఎస్‌డబ్ల్యుఒ కార్యాలయం తరలింపు

ప్రజాశక్తి - బొబ్బిలి

గ్రోత్ సెంటర్ సమీపంలో ఉన్న ఎస్‌సి బాలుర కళాశాల హాస్టల్ భవనంలోకి ఎఎస్‌డబ్ల్యూఒ కార్యాలయాన్ని తరలించినట్లు ఎఎస్‌డబ్ల్యూఒ సత్యనారాయణ చెప్పారు. ఆర్‌టిసి కాంప్లెక్స్ సమీపంలో ఉన్న ఎస్‌సి హాస్టల్ భవనంలో ఎఎస్‌డబ్ల్యూఒ కార్యాలయం ఉండేది. భవనం శిథిలావస్థకు చేరడంతో కార్యాలయానికి మార్చామని, విద్యార్థులు, వార్డెన్లు గమనించాలని కోరారు.

సిఐటియు మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి- శృంగవరపుకోట

విశాఖలో డిసెంబరు 31 నుంచి జరగనున్న సిఐటియు 18వ అఖిలభారత మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు చెలికాని ముత్యాలు కోరారు. ఈ సందర్భంగా పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం ఆవరణంలో శుక్రవారం మహాసభల గోడపత్రికను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లక్షలాదిమంది కార్మికులు, ఉద్యోగులు, అసంఘటితరంగ కార్మికులు, స్కీం వర్కర్లు మహాసభల సందర్భంగా జరిగే మహాప్రదర్శన, బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆనంద్, మహేష్, లక్ష్మణ్, రాధ, స్వర్ణ, దీప్తి, రాణి, ఎర్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు తక్కువ మోతాదులో వినియోగించాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

రైతులు పురుగుల మందులు, ఎరువులు తక్కువ మోతాదులో వినియోగించాలని ఎఒ పి.శ్రీలక్ష్మి సూచించారు. శుక్రవారం మొయిద నారాయణపట్నంలో ఆమె పొలంబడి నిర్వహించి సమగ్ర పంట నిర్వహణ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మోతాదుకు మించు పురుగుల మందులు, ఎరువులు వినియోగిస్తే తెగుళ్ళు రావడమే కాకుండా రైతులకు ఖర్చు పెరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో వ్యసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణపై సిబ్బందికి శిక్షణ

ప్రజాశక్తి - వంగర

మండలంలోని ధాన్యం కొనుగోలుకు సిబ్బంది అంతా సిద్ధంగా ఉండాలని తహశీల్దార్ పిన్నింటి రామారావు అన్నారు. ఈ మేరకు ధాన్యం కొనుగోలు సిబ్బందికి స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో అతి త్వరలో ధాన్యం కొనుగోలు ప్రారంభిస్తామని దీనికి సంబంధించి తేదీ ప్రకటిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి తట్టికోట కన్నబాబు, సిఎస్‌డిటి ఈశ్వరరావు పాల్గొన్నారు.

ముగిసిన ఎన్ఎస్ఎస్ వారోత్సవాలు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చరిత్ర విభాగం ఉపన్యాసకులు చల్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏడు రోజులపాటు నిర్వహించిన ఎన్ఎస్ఎస్ ప్రత్యేక వారోత్సవాలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. ఏడు రోజులపాటు విద్యార్థులు స్వచ్ఛంద సేవకులు గ్రామ ప్రజల్లో విద్యా ప్రాధాన్యత, పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్య అవగాహన వంటి అంశాలపై ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ మారడాన సతీష్, గవర్నమెంట్ హైస్కూల్ హెచ్ఎం సురేష్, కళాశాల ప్రిన్సిపాల్ సి.హెచ్. కేశవరావు, ఉపప్రిన్సిపాల్ వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

సోషలిజంతోనే సమన్యాయం

ప్రజాశక్తి-బొబ్బిలి రూరల్

సోషలిజంతోనే సమన్యాయం జరుగుతుందని సిపిఎం మండల కార్యదర్శి ఎస్. గోపాలం అన్నారు. మండలంలోని ఎం. బూర్జవలసలో శుక్రవారం అక్టోబర్ విప్లవం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అక్టోబర్ రష్యా విప్లవం స్ఫూర్తితో సమ సమాజం కోసం, సోషలిస్ట్ వ్యవస్థ కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు జి అప్పలనాయుడు, ప్రజలు పాల్గొన్నారు.

వేపాడ: సోషలిజమే ప్రత్యామ్నాయమని, రష్యా విప్లవ స్ఫూర్తితో ముందుకెళ్దామని సిపిఎం నాయకులు చాల్లా జగన్ అన్నారు. అక్టోబర్ విప్లవం జయప్రదం అయ్యి 108 ఏళ్లు అయిన సందర్భంగా కొండగంగుపూడిలో ఆయన మాట్లాడారు. 108 సంవత్సరాలు క్రితం నవంబర్ 7న రష్యా విప్లవం విజయవంతం అయి కార్మిక రాజ్యం ఏర్పడిందన్నారు.

రాజాం: సోషలిస్ట్ విప్లవ దినోత్సవం స్ఫూర్తితో ఉద్యమిద్దామని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కాకి సురేష్ పిలుపునిచ్చారు. సిపిఎం నాయకులు ఎం.త్రినాధ్ అధ్యక్షతన రాజాంలో శుక్రవారం సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామ్రాజ్యవాదాన్ని ఓడించి సోషలిజమే ప్రత్యామ్నాయంగా ముందుకు వెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సూర్యనారాయణ, రమణ, నాయుడు, శ్రీను, రాము పాల్గొన్నారు.

మెంటాడ రూరల్: మెంటాడలో శుక్రవారం సిపిఎం కార్యాలయ ఆవరణంలో వందేళ్లు పూర్తి చేసుకున్న సోషలిజం జెండాను సిపిఎం మండల కార్యదర్శి రాకోటి రాములు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కొన్ని దేశాలు, రాష్ట్రాలు సోషలిజం అమలు చేస్తూ ఆయా ప్రజలకు సమాన ఫలాలు అందిస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఐద్వా కమిటీ సభ్యులు రాకోటి కృష్ణవేణి, సిఐటియు మండల అధ్యక్షులు పొట్నూరు వరలక్ష్మి, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గజపతినగరం: మండల కేంద్రంలో, జయంతి కాలనీలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి. లక్ష్మి జెండా ఆవిష్కరణ చేశారు. ఆమె మాట్లాడుతూ సంపద సృష్టించే వాళ్ళకి రాజ్యం రావాలని, కార్మిక, కర్షక, శ్రమజీవులైన ప్రజలను ఆర్థిక దోపిడి, సామాజిక పీడనల నుంచి విముక్తి చేయాలని పోరాటం చేసి లెనిన్ నాయకత్వంలో విప్లవాన్ని సాధించిన రోజు ఈ రోజు అని గుర్తు చేశారు. దీనిని అక్టోబర్ విప్లవం అంటారని చెప్పారు. దీని స్ఫూర్తిగా యువత, ప్రజలు ఐకమత్యంతో సోషలిజం సాధించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పి.కోటి, టి.పైడిరాజు, మంగ, ఈశ్వరరావు, శకుంతల, ఎస్ శ్రీదేవి, డి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


గజపతినగరం: జెండాను ఆవిష్కరిస్తున్న సిపిఎం లక్ష్మి

పిఆర్‌సి కమిటీని నియమించాలి

ప్రజాశక్తి- భోగాపురం

పిఆర్‌సి కమిటీని నియమించి ఐఆర్ మంజూరు చేయాలని భోగాపురం తాలూకా యూనిట్ ఎపిఎన్‌జిఒ కార్యవర్గ సభ్యులు డిమాండ్ చేశారు. శుక్రవారం తాలూకా యూనిట్ కార్యవర్గ సభ్యులు సమావేశం భోగాపురంలో నిర్వహించారు. తాలూకా అధ్యక్షులు కొమ్మూరు దుర్గారావు అధ్యక్షన జరిగిన ఈ సమావేశంలో ఉద్యోగ ప్రతినిధులు మాట్లాడుతూ ఉద్యోగులు సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్ బకాయలు జిఎఫ్ఏపిజిఎల్‌లు, సరండర్ లీవ్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం భోగాపురం, పూసపాటిరేగ, డెంకాడ మండలాల్లో ఎన్‌జిఒ సభత్వం వేగవంతం చేసేందుకు సమావేశం తీర్మానించింది. ఈ సమావేశంలో ఎన్‌జిఒ తాలూకా యూనిట్ కోశాధికారి కె.చిన్నారావు, ఉపాధ్యక్షులు సి.హెచ్ సత్యనారాయణ, ఉమాపతి, మహిళా కార్యదర్శి పి. కృష్ణవేణి, సంఘ ప్రతినిధి ప్రసన్న పాల్గొన్నారు

కేన్సర్‌పై అవగాహన తప్పనిసరి

ప్రజాశక్తి - కొత్తవలస

కేన్సర్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన తప్పనిసరిగా ఉండాలని పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ సీతల్ వర్మ అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం జాతీయ కేన్సర్ అవగాహనా దినోత్సవంలో భాగంగా ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వం ఉచితంగా కేన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయిస్తుందని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ స్వర్ణలత, సిహెచ్ఒ అప్పలకొండ, సన్యాసినాయుడు, సూపర్‌వైజర్ సూరిదేముడు, బేబీరాణి, ఎంఎల్‌హెచ్‌పిలు, ఏఎన్‌మ్, ఆశా కార్యకర్తలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వియ్యంపేట పిహెచ్‌సి వైద్యులు గోపాలకృష్ణ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కుమారి, పులిబంటి జ్యోతి, విరోతి కొండలరావు, చింతల రాములమ్మ, రంగుడు పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేన్సర్ మహమ్మారిని తరిమి కొట్టాలి

రామభద్రపురం: క్యేన్సర్ మహమ్మారిని తరిమికొట్టాలని ఆరికతోట పిహెచ్‌సి వైద్యులు అపర్ణ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆరికతోట, బూసాయవలస, నాయుడువలస గ్రామాల్లో కేన్సర్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సహాయకులు మధు, పాఠశాల హెచ్ఎమ్ రెడ్డి వేణు, జేసీ రాజు, ఏఎన్ఎమ్ భవాని, ఆశవర్కర్ లక్ష్మీ, సుబ్బలక్ష్మి ఆయా గ్రామాల సర్పంచులు, స్థానిక పిఎసిఎస్ చైర్మన్ జాగాన ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రేగిడి: కేన్సర్‌పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బూరాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ వి.రీనా చౌదరి అన్నారు. బూరాడ గ్రామంలో శుక్రవారం కేన్సర్ దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో హెల్త్ ఈవో రాధాకృష్ణ, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



కొత్తవలస: అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

వసతిగృహాన్ని పరిశీలించిన ఎబిసిడబ్ల్యుఒ

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - వంగర

మండలంలోని ఎం.సీతారాంపురం బీసీ బాలుర వసతి గృహాన్ని బొబ్బిలి సహాయ వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి ఎ. శ్యామల కుమారి శుక్రవారం పరిశీలించారు. అరకొర విద్యార్థులే అనే కథనం ప్రజాశక్తిలో ఈ నెల 7న వెలువడటంతో జిల్లా కలెక్టర్ స్పందించి అక్కడ వసతి గృహంలో ఉన్న సమస్యలు తక్షణం పరిష్కరించాలని వసతి గృహ అధికారులకు ఆదేశించారు. ఈ మేరకు ఆమె హుటాహుటిన హాస్టల్ వద్దకు చేరుకుని క్షేత్రస్థాయిలో పరిశీలించి అక్కడ చదువుకుంటున్న విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగితెలుసుకున్నారు. వసతి గృహంలో ఉన్న పుట్టను కూలీలతో తొలగించి చదును చేయించారు. మురుగు నీరు నిల్వ ఉండి పోవడాన్ని గుర్తించి మట్టిని తవ్వించి నీటిని బయటకు తరలించారు. వసతిగృహం ప్రహరీ పక్కన చెత్తా చెదారం, ఆట స్థలంలో పిచ్చి మొక్కలు ఉండడంతో వాటిని కూలీలతో తొలగించి పరిశుభ్రం చేయించారు. ఎఫ్ఆర్ఎస్‌లో విద్యార్థులు హాజరను పరిశీలించారు. 78 మంది విద్యార్థులకు గాను 68 మంది విద్యార్థులు హాజరయ్యారని వెల్లడించారు. విద్యార్థుల బాగోగులను సక్రమంగా చూసుకోవాలని సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమాధికారి ఎస్ సత్తిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.


పుట్ట తొలగింపును పరిశీలిస్తున్న ఎబిసిడబ్ల్యుఒ

కార్మికుల ప్రాణాలకు విలువ లేదా?

ప్రజాశక్తి- రాజాం

రైస్‌మిల్లు కార్మికుల ప్రాణాలకు విలువ లేదా అని సిఐటియు జిల్లా అధ్యక్షులు కె.సురేష్ ప్రశ్నించారు. స్థానిక రైస్ మిల్లుల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలంటూ శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపి డిప్యూటీ తహశీల్దార్ ప్రకాష్ రాజుకు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ రాజాం రైస్ మిల్లు కార్మికులు రైస్‌మిల్లుల్లో ఉన్న 100, 80 కేజీల ధాన్యం బస్తాల బరువును 50 కేజీలకు తగ్గించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం కళాశీలు ఆ బరువులను మోయడం కష్టమవుతోందని చెప్పారు. పొరపాటున బస్తా జారినా, కాళ్లు జారినా కార్మికుని ప్రాణానికే ప్రమాదం జరిగే పరిస్థితి ఉందన్నారు. అధికారులు స్పందించి 50 కేజీల బస్తాలను సిద్ధం చేసేలా అన్ని రైతు సేవా కేంద్రాలకు వెంటనే ఆదేశాలు ఇచ్చి న్యాయం చేయాలని లేని పక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎం.త్రినాథ్, రైస్‌మిల్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు జి.కంచినాయుడు, జి.శ్రీనివాసరావు, జి.సూర్యనారాయణ, సింహాచలం, వెంకటరమణ, చిట్టి నాయుడు, సీతారాం తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న నాయకులు, కార్మికులు

దేవస్థానం భూముల రైతులకు ఎరువులు ఇవ్వరా?

ప్రజాశక్తి - నెల్లిమర్ల

దేవస్థానం భూములకు ప్రభుత్వం ఎరువులు ఇవ్వకుంటే రైతులు ఎలా వ్యవసాయం చేస్తారని ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్ బాబు ప్రశ్నించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి అంబళ్ల సుధారాణి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వ్యవసాయశాఖపై చర్చ జరుగుతున్న సందర్భంలో ఎమ్మెల్సీ డాక్టర్ సురేష్ బాబు మాట్లాడుతూ యూరియా ఎక్కువ వాడితే కేన్సర్ వచ్చే ప్రమాదం ఉందని సాక్షాత్తు సిఎం చంద్రబాబు చెప్పడం తగదన్నారు. రైతులకు సరిపడా యూరియా ప్రభుత్వం అందించడంలో విఫలమైందని చెప్పారు. మొంథా తుపాన్ వల్ల జరిగిన పంట నష్టం అంచనా వేసి, రైతులకు న్యాయం చేయాలని అధికారులకు సూచించారు. జెసితో మాట్లాడి దేవస్థానం భూములకు ఎరువులు అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. అర ఎకరం ఉన్నా, పది ఎకరాలు ఉన్నా ఒక యూరియా బస్తా ఇవ్వడం ఏమిటని పారసాం సర్పంచ్ గొలజాన నారాయణరావు ప్రశ్నించారు. గొర్లిపేటలో దేవస్థానం భూములకు ఈక్రాప్ చేయాలని సర్పంచ్ పరిశినాయుడు కోరారు. విద్యాశాఖపై చర్చ జరుగుతున్న సందర్భంలో ఎల్ఎన్‌పేటలో అంగన్వాడీ కేంద్రాన్ని ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వకుండా ప్రాథమిక పాఠశాలలోకి తరలించారని చంద్రంపేట నాయకులు కర్రోతు వెంకటరమణ ప్రశ్నించారు. ఎంపిపి సుధారాణి మాట్లాడుతూ ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వకుండా అంగన్వాడీ కేంద్రాన్ని ఎందుకు తరలించారని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ శారదని ప్రశ్నించారు. ఈ సమావేశంలో పూసపాటిరేగ ఎఎంసి చైర్ పర్సన్, గేదెల గాయత్రి, అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.



దేవస్థానం భూములపై ఎఒను ప్రశ్నిస్తున్న ఎమ్మెల్సీ సురేష్‌బాబు

అంగన్వాడీ పాలు అమ్మితే క్రిమినల్ కేసులు

ప్రజాశక్తి - రామభద్రపురం

అంగన్వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తున్న పాలు అమ్మకాలు చేస్తే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని ఎపి డెయిరీ డవలప్మెంట్‌కోపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్ మేనేజర్ రాకేష్ హెచ్చరించారు. మండల కేంద్రంలో పాల ప్యాకెట్లు నిల్వ చేస్తున్న గోడౌన్‌లో శుక్రవారం తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రాల్లోనే పాలు వినియోగం చేయాలని, ఇతర మార్కెట్లకు పాలను వినియోగం చేస్తే చర్యలు తప్పవని అన్నారు. అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్టణం, పార్వతీపురం మన్యం, శ్రీకాకళం, విజయనగరం జిల్లాల్లో కర్ణాటక మిల్క్, ఫెడరేషన్ ఆధ్వర్యంలో 17.88 లక్షల లీటర్ల పాలు ప్రతిరోజూ అంగ న్వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తున్నామని తెలిపారు. అనంతరం గోడౌన్‌లో ఉన్న రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ట్రాన్స్ పోర్ట్ ఇన్చార్జ్ పవన్‌కుమార్, గోదాం ఇన్చార్జ్ నాగరాజు పాల్గొన్నారు.

కోటి సంతకాల సేకరణ

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని దల్లిపేట, గూడెపువలస గ్రామాలలో సర్పంచ్ దల్లికాంతమ్మ, వైసిపి నాయకులు దల్లి శ్రీనివాసరావు, కొల్లి రామూర్తి, కొయ్య లక్ష్మణ్ రెడ్డి ఆధ్వర్యంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా శుక్రవారం కోటి సంతకాల సేకరణ, రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి, ఉపాధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని కోరారు. అనంతరం దల్లిపేట పంచాయతీ వైసిపి అధ్యక్షుడిగా దల్లి రామగోవింద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి సుందర హరీష్, వైస్ ఎంపిపి ప్రతినిధి పచ్చపాల గురునాథ్, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వాట్సాప్ గవర్నెన్స్‌పై అవగాహన

ప్రజాశక్తి - వేపాడ

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన వాట్సాప్ గవర్నన్స్ విధానంపై పంచాయతీ కార్యదర్శులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ విధానం వల్ల కలిగే ప్రయోజనాలు గూర్చి వివరించారు. ఈ విధానం వల్ల ఎప్పటికప్పుడు సమస్యలు త్వరితగతిన పరిష్కరించుకునేందుకు ఆకాశం ఎక్కువగా ఉందని కార్యదర్శులకు తెలియజేశారు.

ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులుగా కిల్లాడ

ప్రజాశక్తి- మెరకముడిదాం

ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని ఉత్తరావిల్లి గ్రామానికి చెందిన ఉన్నత విద్యావంతుడు కిల్లాడ సురేంద్రబాబు మాదిగను జిల్లా కార్యవర్గ సమావేశంలో ఎన్నుకున్నట్లు ఎంఆర్‌పిఎస్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మున్నంగి నాగరాజు ప్రకటించారు. ఈ సందర్భంగా సురేంద్రబాబును ఎమ్మార్పీస్ నాయకులు అభినందించారు.


సురేంద్రబాబు

ప్రజా దర్బార్‌కు వినతుల వెల్లువ

ప్రజాశక్తి - వేపాడ

స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి నిర్వహించిన ప్రజా దర్బారుకు దరఖాస్తులు వెల్లువలా వచ్చాయి. ముందుగా వందేమాతరం జాతీయ గీతాన్ని ఆలపించి అనంతరం ప్రజలు ఇచ్చిన దరఖాస్తులను స్వీకరించారు. ఆమెకు వచ్చిన 200 దరఖాస్తులను శాఖా పరంగా వేరుచేసి ఆయా శాఖలకు పంపించి త్వరితగతిన సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ప్రధానంగా రెవెన్యూ సమస్యలపై అధికంగా దరఖాస్తులు వచ్చినట్లు ఆమె తెలిపారు. జిల్లా కలెక్టర్ అనుమతులు లేకుండా తొమ్మిది తాగునీటి బోర్లు తవ్వడంపై గ్రీవెన్స్‌లో గతంలో ఇచ్చిన దరఖాస్తుపై స్పందించి తొమ్మిది బోరుబావులకు బిల్లులు ఆపివేయాలని సిఇఒకు, ఆర్‌డబ్ల్యుఎస్ జిల్లా అధికారులకు ఆదేశించారు. బాణాది ఎంపిటిసి గొంప తులసి తాగునీటి సమస్య, హోమియో వైద్య ఆసుపత్రిని వెల్నెస్ సెంటర్లోకి మార్చాలని ఎమ్మెల్యేకు వినతినిచ్చారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ జె.రాములమ్మ, ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ, ఎంపిపి దొగ్గ సత్యవంతుడు, జెడ్‌పిటిసి ఎస్.అప్పలనాయుడు, టిడిపి నియోజకవర్గం మహిళా అధ్యక్షులు గుమ్మడి భారతి, మండల అవేర్నెస్ కమిటీ చైర్మన్ గొంప తులసి తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేకు వినతినిస్తున్న ఎంపిటిసి గొంప తులసీ

పారాది కాజ్‌వేకు రూ.12లక్షలు మంజూరు

బొబ్బిలి: పారాది కాజ్‌వే బాగు చేసేందుకు స్పెషల్ గ్రాంట్ నుంచి కలెక్టర్ రూ.12లక్షలు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే బేబినాయన ఒక ప్రకటనలో తెలిపారు. మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు వేగావతి నది ఉధృతంగా ప్రవహించడంతో వరద ఉధృతికి కాజ్‌వే కొట్టుకుపోయింది. కాజ్‌వే ధ్వంసం కావడంతో వాహనాలు రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడడంతో కాజ్‌వే బాగు చేసేందుకు నిధులు మంజూరు చేయాలని కలెక్టర్‌ను బేబినాయన కోరాడంతో స్పెషల్ గ్రాంట్ నుంచి నిధులు మంజూరు చేస్తామన్నారు. త్వరలో పనులు ప్రారంభించి కాజ్‌వే బాగు చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

బంగారమ్మ ఆలయ ప్రతిష్టలో మంత్రి

ప్రజాశక్తి- దత్తిరాజేరు

మండలంలోని గడసాంలో శ్రీబంగారమ్మతల్లి ఆలయ ప్రతిష్ట మహోత్సవంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ శుక్రవారం పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడసాం గ్రామంలో బంగారమ్మ ఆలయం నిర్మించడం వల్ల గ్రామ ప్రజలకు మంచి జరుగుతుందన్నారు. ఆయన వెంట టిడిపి మండల అధ్యక్షులు చప్ప చంద్రశేఖర్, మజ్జి మహేష్, అప్పలనాయుడు, వెంకటరమణ, గణపతి, శివ తదితరులు ఉన్నారు.


అమ్మవారిని దర్శించుకుంటున్న మంత్రి శ్రీనివాస్

విఎఎకు షోకాజ్ నోటీస్

రేగిడి: మండలంలోని అంబాడ వెంకటాపురం రైతు సేవా కేంద్రంలో పని చేస్తున్న వ్యవసాయ అసిస్టెంట్ బి.ప్రశాంత్‌కు షోకాజ్ నోటీస్ జారీ చేసినట్లు ఎఒ శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. ప్రశాంత్ రైతు సేవాకేంద్రంలో రైతులకు అందు బాటులో లేకపో వడం అక్కడ రైతులు ఇబ్బందులు పడుతున్నారని స్వయంగా రైతులు తెలిపారని వెల్లడించారు. చాలాసార్లు మందలించినా పనిత నంలో మార్పు లేకపో వడం రైతులు, గ్రామస్థుల ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టి షోకాజ్ నోటీస్ జారీ చేశామన్నారు. ప్రవర్తన మారకుంటే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సస్పెండ్ చేస్తామన్నారు.

మహిళ మృతి

తెర్లాం: పెరుమాలికి చెందిన కె. శ్రీలత(45) బస్సు ఢీ కొనడంతో శుక్రవారం మృతి చెందింది. భర్తతో కలిసి చీపురుపల్లి ద్విచక్ర వాహనంపై వెళుతున్న వారిని మొరకముడిదాం మండలం ఐతంవలస రోడ్డు మలుపు వద్ద ఎదురుగా వస్తున్న ఆర్‌టిసి బస్సు ఢీ కొంది. ఈ ప్రమాదంలో ఆమె అక్కడికక్కడే చనిపోగా భర్త సంఘం నాయుడుకు గాయాలయ్యాయి.

జనసేనలో 20 కుటుంబాలు చేరిక

పూసపాటిరేగ: మండలంలోని కనిమెల్ల గ్రామంలో వైసిపిని వీడి 20 కుటుంబాలు జనసేన పార్టీలో చేరాయి. స్థానిక నాయకుడు శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి కొత్తగా చేరిన వారికి జనసేన కండువా కప్పి ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు జలపారి శివ, గుడివాడ జమరాజు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గిరిజన సంఘం, ఎస్ఎఫ్ఐ నాయకులు

10న గిరిజన మంత్రి ఇంటి ముట్టడి

ఆదివాసీ గిరిజన సంఘం, ఎస్ఎఫ్ఐ పిలుపు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

అనారోగ్యంతో మృతి చెందిన గిరిజన విద్యార్థుల కుటుంబాలకు ప్రభుత్వం తక్షణమే రూ.50 లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 10న ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చలో సాలూరు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి ఇంటిని ముట్టడించనున్నట్టు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బి.అనిల్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ఆదివాసీ గిరిజన భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనారోగ్యంతో మరణించిన గిరిజన విద్యార్థుల కుటుంబాలకు ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలన్నారు. విజయనగరంలో గురువారం జరిగిన జడ్పీ సర్వసభ్య సమావేశంలో గిరిజన మంత్రి గిరిజన విద్యార్థుల మరణాల ఎక్స్‌గ్రేషియాపై మాట్లాడిన మాటలు సరికాదని ఖండించారు. ప్రభుత్వాలపై నమ్మకంతోనే పిల్లలను తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తున్నారన్నారు. అక్కడ సరైన మౌలిక వసతులు, సదుపాయాల్లేకపోవడంతో విద్యార్థులు అనారోగ్యంబారిన పడి చనిపోతున్నారని అన్నారు. దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. విద్యార్థులకు నష్టపరిహారం ప్రకటించి, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. దీనిపై అనేకసార్లు పేరెంట్స్ కమిటీలు, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు, ప్రభుత్వానికి ఎంత డిమాండ్ చేసినా చీమకుట్టినట్టు కూడా లేదన్నారు. గిరిజన విద్యార్థులు ఇంతమంది మరణిస్తుంటే గిరిజన సంక్షేమ శాఖ మంత్రికి పట్టడం లేదా అని ప్రశ్నించారు. బస్సు ప్రమాదంలో, గుడిలో తొక్కిసలాటలో మరణించిన వారికి ప్రభుత్వం రూ.15 లక్షలు నష్టపరిహారం చెల్లించిందని, విద్యార్థుల మరణాలపై ఎందుకు స్పందించడం లేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఏదైతే గిరిజన సంక్షేమ శాఖ మంత్రి తొలి సంతకమైన పాఠశాలలో ఆరోగ్య కార్యకర్తల నియామకానికి చేశారో అది అమలు చేయాలని, నష్టపరిహారం ఈనెల 9లోపు ప్రకటించకపోతే 10న పెద్ద ఎత్తున విద్యార్థులను, ప్రజానీకాన్ని సమీకరించి మంత్రి ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి ఎ.గంగారావు, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కోశాధికారి మండంగి రమణ, మండల నాయకులు ఎం.సన్యాసిరావు, కె.గంగారావు ఉన్నారు.

గ్రీన్ అంబాసిడర్ల బకాయి వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి పాలకొండ

బకాయి వేతనాలు చెల్లించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గ్రీన్ అంబాసిడర్లు ఎంపిడిఒ ఎంవి రంగారావుకు సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కాదా రాము అధ్యక్షతన శుక్రవారం వినతిని అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు మాట్లాడుతూ నిత్యం పెరుగుతున్న నిత్యావసర సరుకులు ధరలు, పెట్రోలు డీజిల్, కరెంటు చార్జీలు భారాలు భరించలేక కుటుంబాలు అర్ధాకలితో గడుపుతున్నారని, దీనికితోడు ప్రతినెలా సక్రమంగా జీతాలు చెల్లించడం ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్మికులకు చెల్లిస్తున్న విధంగా పంచాయతీ గ్రీన్ అంబాసిడర్ కార్మికులకు రూ.21వేలు జీతం చెల్లించాలని, జిఒ 132, 142, 680లు అమలు చేయాలని, అమలు చేయని అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పంచాయతీ కార్యదర్శులతో జాయింట్ సమావేశం వేయాలని, సమస్యలు పరిష్కారాన్ని కృషి చేయాలని కోరారు .కార్యక్రమంలో పలువురు గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

వెంకంపేటలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మండలంలోని వెంకంపేటలో బందలుప్పి వైద్యాధికారి డాక్టర్ సిహెచ్.శంకరరావు ఆధ్వర్యంలో 104 వైద్య శిబిరం శుక్రవారం నిర్వహించారు. 60ఏళ్లు పైబడిన వారు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారితో పాటు, గర్భిణీలు, బాలింతలకు అన్ని వైద్య పరీక్షలు చేసి వారికి కావాల్సిన మందులు ఇస్తూ, జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జ్వరం లక్షణాలున్నవారికి రక్త నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించాలన్నారు. వ్యాధుల దృష్ట్యా గ్రామాల్లో రోజూ వైద్య పరీక్షలు చేస్తుండాలని, ఎటువంటి వ్యాధి లక్షణాలున్నా అటువంటి వారిని త్వరగా గుర్తించి వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. 104 వాహనంలో మందుల కొరత లేకుండా చూడాలని సిబ్బందికి ఆదేశించారు. కార్యక్రమంలో సూపర్వైజర్ శ్రీరాములునాయుడు, వైద్య సిబ్బంది,104 సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలో చినమేరంగి విద్యార్థిని ప్రతిభ

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం

జిల్లా పోలీసు శాఖ నిర్వహించిన మహిళల సంరక్షణలో విద్యార్థుల పాత్ర అనే అంశంపై వ్యాసరచన పోటీలో జియమ్మ వలస మండలం చినమేరంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి విద్యార్థిని మధుమిత చౌదరి జిల్లాస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. విజేతకు జిల్లా ఎస్పీ రూ.5వేలు నవదు బహుమతి అందించారు. విద్యార్థిని తండ్రి ప్రసన్నకుమార్ చౌదరి గుమ్మలక్ష్మీపురం మండలం చాపరాయి బెన్నిడిలో పంచాయతీ సెక్రటరీగా పనిచేస్తున్నారు. పాఠశాల హెచ్ఎం ఆర్‌విఎస్ఎన్ మూర్తి, విద్యా కమిటీ సభ్యులు అభినందించారు. గతంలో ఇదే పాఠశాలకు చెందిన ముక్తేశ్వరి కూడా జిల్లా ప్రథమ స్థానాన్ని పొందడం గమనార్హం.

ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - వీరఘట్టం

ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి మినహాయించి బోధనకే పరిమితం చేయాలని యుటిఎఫ్ వీరఘట్టం మండల శాఖ ప్రతినిధులు డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని. తలవరం, పనస నందివాడ, కుమ్మరిగుంట, నీలానగరం, ఎంవి పురం, తెట్టంగి, ఆడారు, బిటివాడ, వండవ, పాపంపేట, బొడ్లపాడు, తూడి, తదితర గ్రామాల్లోని పాఠశాలలను యుటిఎఫ్ ప్రతినిధులు సందర్శించి మాట్లాడారు. వీరగాథ, 5.0 వికషిత్ భారత్, తదితర బోధనేతర కార్యక్రమాల నుంచి ఉపాధ్యాయులను మినహాయించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలన్నారు. 12వ పిఆర్‌సి కమిషన్ పునరుద్ధంచాలని, 29 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని, ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయించాలని అన్నారు. ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలన్నీ తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పైడిరాజు, అధ్యక్ష కార్యదర్శులు కె.గోవిందరావు, బోనంగి దుర్గ ప్రసాద్, సీనియర్ నాయకులు కె.గౌర్నాయుడు, ఎస్ మహేష్, బి రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోలమాంబ అమ్మవారి ట్రస్ట్ బోర్డు సభ్యులు వీరే

ప్రజాశక్తి -మక్కువ

రాష్ట్ర జాతరగా అవతరించిన పోలమాంబ అమ్మవారి ట్రస్ట్ బోర్డ్ ఎట్టకేలకు ఏర్పాటు కానున్నది. ధర్మకర్తల మండలికి సంబంధించిన పదిమంది పేర్లను మంత్రి ప్రతిపాదించినట్లు ఆలయ ఇఒ శ్రీనివాస్ శుక్రవారం వెల్లడించారు. నైదాన చిన్న తిరుపతి, తీళ్ల సింహాచలం, అఖ్యాన సింహాచలం, గొట్టాపు భవాని, జి.లలిత కుమారి, సిహెచ్ దాక్షారాణి, ఎ.వెంకటేష్, వి.నారాయణమ్మ, ఎస్.సత్యవత్తమ్మ, వి.రాము ప్రతిపాదించినట్లు ఆయన వెల్లడించారు. ఎపి ధార్మిక మంత్రిత్వ శాఖ జారీచేసిన ఉత్తర్వులు మేరకు త్వరలో మంత్రి సంధ్యారాణి సమక్షంలో ఒకర్ని చైర్మన్గా ఎన్నుకొని ప్రమాణ స్వీకార కార్యక్రమం చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు.

అక్రమ రవాణాపై స్పందించిన ఇరిగేషన్ అధికారులు

'ప్రజాశక్తి'వార్త కు స్పందన

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక ఇరిగేషన్ కార్యాలయానికి కూతవేటు దూరంలో గల సోమసాగరం చెరువులో మట్టి అక్రమ రవాణాపై గురువారం 'ప్రజాశక్తి'లో వచ్చిన కథనానికి అధికారులు వెంటనే స్పందించారు. ఇరిగేషన్ శాఖ అధికారుల బృందం శుక్రవారం ఆ చెరువు వద్దకు వెళ్లి పరిస్థితులను పరిశీలించి చెరువులో తవ్వకాలు జరుగుతున్న ప్రాంతాలను తనిఖీ చేశారు. మట్టి తరలింపుకు సంబంధించి అనుమతులు ఉన్నాయా లేదా అనే వివరాలు సేకరించారు. చెరువు పరిసర ప్రాంతంలో మట్టి రవాణా కోసం ఎలాంటి అనుమతులు జారీ చేయలేదని తెలిసింది. అక్రమంగా మట్టి తరలింపు జరిగిందని తేలితే సంబంధితులపై చర్యలు తప్పవని చెరువుల రక్షణలో ప్రజల సహకారం కీలకమని అధికారులు పేర్కొన్నారు.

వాడవాడలా వందేమాతరం గీతాలాపన

భారత స్వాతంత్ర్య పోరాట ఉద్యమంలో ఉవ్వెత్తిన లేచిన రణ నినాదంగా మారిన వందేమాతరం గీతానికి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మండలంలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రయివేటు కళాశాలలు, పాఠశాలల్లో శుక్రవారం వందేమాతరం గీతాలాపన చేశారు.

ప్రజాశక్తి-గజపతినగరం

స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం వందేమాతరం గీతం 150వ వార్షికోత్సవంలో భాగంగా విద్యార్థినులు మైదానంలో వృత్తాకారంలో కూర్చుని మధ్యలో 150 అనే అంకెను మానవ రూపంలో ప్రదర్శించారు. ఈ 150 అంకె చుట్టూ జాతీయ జెండాలోని మూడు రంగుల గల క్లాత్‌లు పట్టుకుని నిలబడి ఈ అద్భుతమైన చిత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రమేష్, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మెరకముడిదాం : స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో ఎంపిడిఒ జి.భాస్కరరావు ఆధ్వర్యంలో వందేమాతరం గీతాలాపన చేశారు.



గజపతినగరం.. వందేమాతరం 150 వసంతాల వేడుక సందర్భంగా 150 ఆకారంలో విద్యార్థులు



మెరకముడిదాం.. వందేమాతరం గీతాలాపన చేస్తున్న విద్యార్థులు

బొబ్బిలి: స్థానిక పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం వందేమాతరం జాతీయ గేయం కార్యక్రమం సిఐ కె.సతీష్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ గేయాన్ని అధికారులు, సిబ్బంది, మాజీ సైనికులు, పాఠశాల విద్యార్థులు సామూహికంగా ఆలపించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ జ్ఞాన ప్రసాద్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస: మండల కేంద్రంలో స్థానిక హిందుస్థాన్ వ్యాయామ కళాశాల ఆధ్వర్యంలో వందేమాతరం గేయం గొప్పతనం గురించి పిల్లలకు వివరించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ కర్రీ లీలాప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంతకవిటి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వందేమాతర గీతాన్ని విద్యార్థులు ఆలపించారు. ఈ కార్యక్రమంలో రాజాం రూరల్ సిఐ హెచ్.ఉపేంద్రరావు, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

తెర్లాం: స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో అధికారులు సామూహిక వందేమాతర గీతాలాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రాంబాబు ఎస్ఐ సాగర్‌బాబు, ఎంఇఒ త్రినాధరావు, వెలుగు సిబ్బంది, ఐసిడిఎస్ సిబ్బంది, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రామభద్రపురం: మండల కేంద్రంలో జెడ్పీ ఉన్నత పాఠశాల, నాయుడువలస పాఠశాలలో విద్యార్థులు వందేమాతర గీతాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం.గోపాల నాయుడు, నాయుడువలస పాఠశాల సహాయకులు జేసీ రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డెంకాడ: 5వ బెటాలియన్‌లో కమాండెంట్ రవిశంకర్ రెడ్డి ఆధ్వర్యంలో వందేమాతరం గీతాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమాండెంట్ రాజారెడ్డి, బెటాలియన్ ఆఫీసర్లు, సిబ్బంది, స్కూల్ టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేపాడ: మండలంలోని బక్కునాయుడుపేట ఎపి ఆదర్శ పాఠశాలతో పాటు పలు జిల్లా పరిషత్తు, ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులు వందేమాతరం గీతాన్ని ఆలపించి సంబరాలు చేశారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రంమలో ఎస్ఐ ఎస్.సుదర్శన్, ఎంఇఒలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చీపురుపల్లి : చీపురుపల్లిలో పోలీసు శాఖ ఆధ్వర్యాన విద్యార్థులు, ఉపాధ్యాయులు, పోలీసులు భారీ ర్యాలీ చేపట్టారు. డిఎస్‌పి రాఘవులు మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమానికి స్ఫూర్తినిచ్చి, దేశ ఐక్యతను వందేమాతరం గేయం పెంపొందించిందన్నారు. కార్యక్రమంలో సిఐ జి.శంకరరావు, ఎస్ఐలు లోకేష్, లోకేశ్వరరావు, నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.



వేపాడ.. ర్యాలీ చేపడుతున్న విద్యార్థులు





చీపురుపల్లిలో వందేమాతరం గీతాలాపన చేస్తున్న పోలీసులు, విద్యార్థులు ; డెంకాడ.. ఐదో బెటాలియన్ వద్ద వందేమాతరం గీతాలాపన చేస్తున్న కమాండెంట్, సిబ్బంది

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి- శృంగవరపుకోట

లక్కవరపుకోట మండలంలోని చందులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన సింగంపల్లి సాయికుమార్, కామాకు కిరణ్ కుమార్, దుక్క సతీష్, మూలూరి హేమంత్‌లు రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్ 14,17,19 విభాగంలో స్విమ్మింగ్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పొట్నూరు శ్రీరాములు శుక్రవారం తెలిపారు. ఈ ఎంపిక పోటీలు విజయనగరం ఆక్వా స్విమ్మింగ్ స్టేడియంలో అక్టోబర్ 31వ తేదీన జరిగాయన్నారు. వీరు ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు విశాఖపట్నం బీచ్‌లో గల ఆక్వా సిమ్మింగ్ కాంప్లెక్స్‌లో జరగబోవు రాష్ట్ర స్థాయి సిమ్మింగ్ పోటీలలో విజయనగరం జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని శ్రీరాములు తెలిపారు. ఎంపికైన క్రీడా కారులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు సగుబండి శివరామకృష్ణ, ఉపాధ్యాయులు చిన్నంనాయుడు, మహేశ్వరరావు, బర్నికాన వెంకట్రావు, ఉపాధ్యాయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు కోనాడ విద్యార్థుల ఎంపిక

పూసపాటిరేగ: మండలంలోని కోనాడ జెడ్‌పి హైస్కూల్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థి ఎరుపల్లి యల్లాజి అండర్-17 బాలుర రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఫాస్ట్ బౌలర్‌గా ఎంపికయ్యాడు. 9వ తరగతి విద్యార్థిని ఎన్‌విఎస్ హారిక జిల్లా స్థాయి అథ్లెటిక్స్‌లో 400 మీటర్ల పరుగులో తృతీయ స్థానం సాధించింది. ఇరువురు విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు డి. రాంబాబు, వ్యాయామ ఉపాధ్యాయుడు జివిఎస్ వర్మ అభినందించారు.



శృంగవరపుకోట.. విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం

ఖోఖో రాష్ట్రస్థాయి పోటీలకు గర్భాం విద్యార్థులు

మెరకముడిదాం: అండర్ 19 రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు గర్భాం ఆదర్శ పాఠశాల ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం విద్యార్థి రౌతు జాహ్నవి, 10వ తరగతి చదువుతున్న మగవాపు చరణ్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డివిఎస్ అరుణకుమారి తెలిపారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌కు జొన్నాడ విద్యార్థులు

డెంకాడ: రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అథ్లెటిక్స్ పోటీలకు జొన్నాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన జి.మానస, ఎ.సాత్విక్, సాయి వర్ధిని ఎంపికయ్యారు. వీరు అండర్ 14, 17 విభాగాల్లో ఈ నెల 8,9, 22వ తేదీల్లో పలాస, పలనాడు, హర్డిల్స్‌కు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.లక్ష్మి, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యాకమిటీ చైర్మన్ రమేష్ శుక్రవారం అభినందించారు. ఈ కార్యక్రమంలో పిఇటి పి.లీలాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు హేమశ్రీ

వేపాడ: మండలంలోని బికెఎస్‌పేట ఎపి ఆదర్శ పాఠశాలకు చెందిన ఇంటర్ విద్యార్థి ఎస్ హేమశ్రీ జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైంది. ఇటీవల చిత్తూరు జిల్లా పలమనూరులో జరిగిన రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొని సత్తా చాటిన హేమశ్రీ జాతీయ స్థాయికి ఎంపికైంది. నాంది ఫౌండేషన్ ఆధ్వర్యంలో విజయనగరంలో నిర్వహించిన క్రీడా పోటీలో స్టాండింగ్ లాంగ్ జంప్ విభాగంలో 9వ తరగతికి చెందిన బర్ల జనార్ధన్ జాతీయస్థాయిలో నిర్వహించే పోటీలకు ఎంపికయ్యాడు. జిల్లా స్థాయిలో జరిగిన అండర్ 14 క్రీడా విభాగంలో తొమ్మిదో తరగతి చదివిన జి.మధు రన్నింగ్‌లో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. వీరిని ప్రిన్సిపల్ రావాడ ఈశ్వరరావు, పీడీ రమ అభినందించారు.



గంట్యాడ.. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థులు

గంట్యాడ: స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ఈ నెల 8 9 10 తేదీల్లో జరగనున్న 69వ స్టేట్ గేమ్స్ ఫెడరేషన్ నెట్‌బాల్ పోటీలకు హాజరవుతారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు అలమండ ఝాన్సీ తెలిపారు. విజయవాడలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు పెదరెడ్ల మౌణిక, గంట హారిక, పితాన వెంకటేష్, బడిగంటి గణేష్ హాజరవుతారని వ్యాయామ ఉపాధ్యాయులు పి.వి.ఎస్ఎన్ రాజు తెలిపారు.

సోషలిజమే సకల సమస్యలకు పరిష్కారం

మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రజల సకల సమస్యలకు సోషలిజమే పరిష్కారమని మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ అన్నారు. శుక్రవారం స్థానిక గిరిజన సామాజిక భవనంలో ప్రజా సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యాన సోషలిజం విశిష్టత-సామ్రాజ్య వాద దోపిడీ అన్న అంశంపై యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహన్ అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శర్మ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా పెట్టు బడిదారీ, కార్పొరేట్ అనుకూల విధానాలు అమలు వేగవంతమైన క్రమంలో ప్రజలు తీవ్ర ఇబ్బందుల్లోకి నెట్టి వేయబడ్డారని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను బలహీనపర్చి కార్పొరేట్ సంస్థలకు అనుకూలమైన విధానాలను ప్రపంచ వ్యాప్తంగా పాలకులు అవలంబిస్తున్నారని, మనదేశంలో కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్లకు దాసోహం అయ్యాయని విమర్శించారు.. ఇటీవల కాలంలో అమెరికన్ సామ్రాజ్యవాదానికి ప్రత్యామ్నాయంగా చైనా కమ్యూనిస్టు ప్రభుత్వం ప్రజా అనుకూల ప్రత్యామ్నాయ విధానాలతో ముందుకు రావడం మంచి పరిణామని తెలిపారు..1917లో విజయ వంతమైన రష్యన్ విప్లవం సోషలిస్టు విధానాలతో ప్రపంచానికే దిక్సూచిగా నిలిచిందని ,అదే స్ఫూర్తితో ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకు, రైతాంగ సమస్యల పరిష్కారానికి , కార్మిక వర్గ హక్కులు కాపాడేందుకు ప్రజా ఉద్యమాలు నిర్మించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు కె గంగునాయుడు, ఎం తిరుపతి రావు, ఎన్ వై నాయుడు, వి ఇందిర, వైమన్మధరావు, కె రామస్వామి, రెడ్డి వేణు, రెడ్డి ఈశ్వరరావు, బి.లక్ష్మి, ఆర్ శ్రీదేవి, గొర్లి వెంకటరమణ, బివి రమణ, కె.భాస్కరరావు, బంటు దాసు, కెసాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ

గర్భిణుల వసతిగృహ సిబ్బందిని కొనసాగించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

స్థానిక ఐటిడిఎ పరిధిలో గల గిరిజన గర్భిణుల వసతిగృహాల్లో పని చేస్తున్న సిబ్బందిని కొనసాగించాలని పలువురు గిరిజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం గిరిమిత్ర హాల్ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఐటిడిఎ పిఒకు పలువురు గిరిజన సంఘాల నాయకులు వినతి పత్రం అందజేశారు. గుమ్మలక్ష్మీపురం, సాలూరు వైటీసీలో నడుస్తున్న గర్భిణుల వసతిగృహంలో పనిచేస్తున్న సిబ్బందిని యధావిధిగా విధులను కొనసాగించాలని, పెండింగ్లో ఉన్న జీతాలు చెల్లించాలని కోరారు. గత కొంతకాలంగా పలు ఆశ్రమ పాఠశాలల్లో, గురుకుల పాఠశాలల్లో చదువుతున్న గిరిజన విద్యార్థులు మృతి చెందారని, మృతుల కుటుంబాలకు ప్రభుత్వం తరుపున నష్టపరిహారం చెల్లించాలని కోరారు. ఆ పాఠశాలల్లో పనిచేసిన ప్రధానోపాధ్యాయులు, వార్డెన్లు, ఆరోగ్య సిబ్బందిని సస్పెండ్ చేయడం సరికాదని చెప్పారు. వారిపై సస్పెన్షన్లు ఎత్తివేయాలని, డిమాండ్ చేశారు. అసంపూర్తి భవనాలను పూర్తిస్థాయిలో నిర్మించాలని గిరిజన నాయకులు పల్ల సురేష్, దుక్క సీతారాం, ఆరిక చంద్రశేఖర్, ఇంటికుప్పల రామకృష్ణ, రొబ్బ లోవరాజు, మంచాల ఈశ్వరరావు, జట్ల బంగారురాజు, కోలక గౌరమ్మ కోరారు.

దగ్ధమైన బస్సు పరిశీలన

ప్రజాశక్తి - పాచిపెంట

ఆంధ్ర-ఒడిశా ఘాట్‌రోడ్డులో దగ్ధమైన ఒడిశా ఆర్టీసీ బస్సును ఆ రాష్ట్రం డిప్యూటీ కమిషనర్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ ప్రమోద్ కుమార్ పాండా శుక్రవారం పరిశీలించారు. ప్రమాదానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట కొరాపుట్ ఎంవిఐ చంద్ర బిశ్వాస్, టెక్నికల్ మేనేజర్ సబీర్ రాజ్ కొరాపుట్ ఆర్‌టిసి డిపో మేనేజర్ ఈశ్వర్ మహాపాత్రో, సాలూరు మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ జేవిస్ ప్రసాద్, పాచిపెంట ఎస్సై వెంకట సురేష్ పాల్గొన్నారు

గిరిజన పిజిఆర్ఎస్‌కు 12 వినతులు

ప్రజాశక్తి - పార్వతీపురం

గిరిజన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 12 వినతులు అందినట్లు జాయింట్ కలెక్టర్, ఇన్‌ఛార్జి ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి తెలిపారు. జిల్లాలో తొలిసారిగా స్థానిక ఐటిడిఎ గిరిమిత్ర హాలులో గిరిజన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమం శుక్రవారం పిఒ సమక్షంలో జరిగింది. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ గిరిజనుల వ్యక్తిగత, సామాజిక, అభివృద్ధి సంబంధిత సమస్యలను నేరుగా సంబంధిత శాఖల అధికారుల సమక్షంలో ఉంచి పరిష్కారం పొందేలా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. కావున ఐటిడిఎ పరిధిలోని గిరిజనులంతా ఈ అవకాశాన్ని వినియోగించుకొని, తమ సమస్యలను పరిష్కరించుకోవాలని తెలిపారు. కాగా ఈ కార్యక్రమంలో అందిన సమస్యల్లో కొన్ని వివరాలు ఇలా..

కురుపాం మండలం కుంచేమానుగూడ నుంచి మండంగి ప్రసాదరావు అర్జీని అందిస్తూ తమ గ్రామానికి విద్యుత్ స్థంబాలు, ట్రాన్స్ ఫార్మర్ ను ఏర్పాటు చేయాలని కోరారు. నీలకంఠాపురం నుంచి గ్రామస్తులు దరఖాస్తును అందిస్తూ 23 కుటుంబాలు ఉన్న తమ గ్రామానికి ఏడు విద్యుత్ స్థంబాలు, ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేయాలని కోరారు. ఽకురుపాంలో ప్రభుత్వం పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని టి ఆర్ఎఫ్ రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు రోబ్బ లోవరాజు, ఐ. రామకృష్ణ వినతిని అందజేశారు. కురుపాం, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మ వలస మండలాల్లో ఎక్కువగా పత్తి సాగు చేస్తున్నారని, ఇక్కడ ప్రభుత్వం పత్తి కొనుగోలు చేయకపోవడం వల్ల దళారీలబారిన పడి గిరిజన రైతులు మోసపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జియ్యమ్మవలస మండలం మరువాడ నుంచి ఆరిక చంద్ర శేఖర్ మాట్లాడుతూ నిడగళ్లగూడ, చినతోలు మండగూడ, పెద్ద దొడ్డి గ్రామాల్లో అసంపూర్తిగా ఉన్న పాఠశాల భవనాలను పూర్తిచేయాలని కోరారు. కార్యక్రమంలో ఎపిఒ పి.మురళీధర్, ఐటిడిఎ పరిధిలోని అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీతంపేట ఐటిడిఎలో...

సీతంపేట : స్థానిక ఐటిడిఎలో నిర్వహించిన పిజిఆర్ఎస్‌కు ఆరు వినతలు వచ్చాయి. పిఒ పవర్ స్వప్నిల్ జగన్నాథ్ ఆధ్వర్యంలో పిజిఆర్ఎస్ నిర్వహించారు. పెద్దపొల్లంకి వలసలోనే యధావిధిగా అంగన్వాడీ కేంద్రం కొనసాగించాలని సుమలత విన్నవించారు. పులిపుట్టి చెందిన జి సుజాత తనకు వింతంతు పెన్షన్ ఇప్పించాలని కోరారు. సిరికొండ, ఒబ్బంగికి ఆశా వర్కర్ పోస్ట్ మంజూరు చేయాలని ప్రతిభ కోరారు. కె.వీరగొట్టంకు చెందిన రామారావు ఏదైనా ఉపాధి కల్పించాలని కోరారు. గ్రీవెన్స్‌లో డిడి అన్నదొర, డిప్యూటీ డిఇఒ రామ్మోహన్ రావు, ఇఇ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



ఫిర్యాదులను స్వీకరిస్తున్న యశ్వంత్‌కుమార్‌రెడ్డి